# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 100 శనివారం | 14 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




## వీధి దీపాల కిందే.. బతుకమ్మ

కనీస ఏర్పాట్లు చేయని బల్దియా

దుమ్మెత్తి పోస్తున్న మహిళలు

8లో..

## అమ్మవారి హరిద్రా దర్శనం



8లో

ప్రభుత్వ వైఫల్యంతోనే..

## నిరుద్యోగి ఆత్మహత్య

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి



2లో



## సీపీని కలిసిన కలెక్టర్

వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన అంబర్ కిషోర్ ఝా ను వరంగల్ కలెక్టర్ పి.ప్రావిణ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.

- వరంగల్ వాయిస్, వరంగల్






# అధికార 'ప్రలోభం'




### జోరందుకుంటున్న తాయిలాలు

నాయకులకు డబ్బులు..
మహిళలకు టిఫిన్ బాక్సులు,
వాటర్ బాటిళ్లు

గెలుపే లక్ష్యంగా చక్రం తిప్పుతున్న నేతలు

సిట్టింగుల తీరుపై మండిపడుతున్న ప్రతిపక్ష నేతలు

వివరాలు 2లో..

అభ్యర్థులను ప్రకటించడంతోపాటు ప్రచారంలో దూసుకుపోతున్న అధికార బీఆర్ఎస్ పార్టీ హాట్రిక్ లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఇప్పటికే ఆపార్టీ నేతలంతా గ్రామాలు, డివిజన్ల వారీగా తమ ప్రచారాన్ని కొనసాగిస్తుండగా ముఖ్య నేతలంతా బహిరంగ సమావేశాలతో హోరెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తాయిలాల పర్వానికి శ్రీకారం చుట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను ఆకర్షించేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు పంచుతుండగా, మహిళలను తమవైపు తిప్పుకునేందుకు గిఫ్టులు ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. పర్వతగిరి మండల పరిధిలోని అధికార పార్టీకి చెందిన సర్పంచుల ఇళ్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్ల కిట్లు లభించడంతో వర్ధన్నపేట నియోజకవర్గంలో పెద్ద దుమారమే రేగింది. దీంతో ప్రతిపక్ష నేతలు అధికార పార్టీ నాయకులపై దుమ్మెత్తి పోస్తున్నారు. అడ్డదారుల్లో అధికారం హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

# అధికార 'ప్రలోభం'



**జోరందుకుంటున్న తాయిలాల పర్వం**
**నాయకులకు డబ్బులు..**
**మహిళలకు టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్లు**
**గెలుపే లక్ష్యంగా చక్రం తిప్పుతున్న నేతలు**
**సిట్టింగుల తీరుపై మండిపడుతున్న ప్రతిపక్ష నేతలు**



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఎన్నికల ప్రచారమే ప్రారంభం కాలేదు. అధికార పార్టీ మినహా ఇతర పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. కాని సీఎం కేసీఆర్ తెలంగాణలోని అన్ని నియోజకవర్గాలకు ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటించడంతో ఇప్పటికే గ్రామాలు, నియోజకవర్గాల్లో ఒక దఫా ప్రచారాన్ని పూర్తి చేసి ఇతర పార్టీ నేతలకంటే ముందు వరుసలో ఉన్నారు. ప్రచారమే కాదు ప్రలోభాల్లో కూడా మేమే నంబర్ వన్ అన్నట్లుగా తాయిలాలకు తెరతీశారు. హుజూరాబాద్ ఎన్నికలను తలపించేలా నోట్ల ప్రవాహాన్ని పారిస్తున్నారు. ఇతర పార్టీలోని నాయకులు, కార్యకర్తలను ఆకర్షించేలా దూకుడు ప్రదర్శిస్తున్నారు. వారికి ప్రజల్లో ఉన్న పతారను బట్టి ఒక్కో నాయకుడికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి గులాభి కండువ కప్పుతున్నారు. ఇదే తరహాలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలను కూడా బీఆర్ ఎస్ లో చేర్చుకుంటూ తమ బలాన్ని, బలగాన్ని పెంచుకుంటున్నారు.

## పట్టు కోసం పాకులాట..

ప్రతిపక్ష పార్టీల నుంచి ఇప్పటి వరకు ఎవరు బరిలో ఉంటారనేది ఇంకా స్పష్టం కాలేదు. మరో రెండు మూడు రోజుల్లో కాం గ్రెస్, బీజేపీ, తదితర పార్టీలు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు రంగంలోకి రాకముందే నియోజకవర్గంలో పట్టు సాధించే దిశగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవాలు, ఆర్థిక సహాయాలు అందజేత వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. బీఆర్ ఎస్ లోకి ఇతర పార్టీల కార్యకర్తలను ఆహ్వానించడంతో పాటు, వారు అడిగిన ఆర్థిక సహాయాలు అందజేసేందుకు వెనుకడుగు వేయడం లేదు. కొంతమంది ఎమ్మెల్యేలు మహిళలకు నగదు అందజేయగా, మరికొందరు వస్తు రూపంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం.

## అడ్డంగా బుక్కయ్యారు..

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సోమారం గ్రామంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి గ్రామ సర్పంచ్ రాపాక రేణుక, నాగయ్య ఇంట్లో వాటర్ బాటిల్స్, లంచ్ బాక్స్ లకు సంబంధించి బ్యాగులను నిలువ చేశారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్నికల స్పెషల్ ఫ్లయింగ్ స్కాడ్ ఆఫీసర్ బాబురావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 180 వాటర్ బాటిల్స్, 280 బ్యాగ్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు నిమిత్తం పర్వతగిరి పోలీసులకు అప్పగించారు. అదేవిధంగా చింత నెక్కొండ సర్పంచ్ గటిక సుష్మా మహేష్ ఇంట్లో 40 డప్పులు, 75 వాటర్ బాటిల్స్, 79 బ్యాగులు, 72 టిఫిన్ బాక్సులను ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ సీజ్ చేసింది. కల్లెడ గ్రామంలోని దొమ్మటి రాజు ఇంట్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఫొటోతో కూడిన 16 లంచ్ బాక్సులు, బ్యాగులను ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకున్నారు.

## అరూరి ఫొటోతోనే..

ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు. అందుకు అనుగుణంగా తాయిలాలు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగా వర్ధన్నపేట సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఫొటోతో ముద్రించిన బ్యాగులు, టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్లు పెద్ద ఎత్తున లభించడంతో ఎన్నికల అధికారులు ఖంగు తిన్నారు. అధికార పార్టీకి చెందిన నేతల ఇంటిలోనే వీటిని భద్రపరచడంతోపాటు అక్కడినుంచే పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రచించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## కేసులు నమోదు చేస్తాం..

పక్కా సమాచారంతో నిర్వహించిన దాడుల్లో అరూరి రమేష్ ఫొటోతో ముద్రించిన టిఫిన్ బాక్సులతోపాటు బ్యాగులను పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల స్పెషల్ ఫ్లయింగ్ స్కాడ్ ఆఫీసర్ బాబురావు తెలిపారు. పార్టీకి సంబంధించిన వస్తువులు ఎవరైనా సరే ఇండ్లలో నిల్వ ఉంచుకుంటే ఎలక్షన్ కోడ్ కు సంబంధించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. అతిక్రమిస్తే వేటు తప్పదన్నారు.

## పాలకుల తీరుపై ప్రతిపక్షాల గరం..

ఎన్నికల ప్రచారమే ప్రారంభం కాకపోయినా అధికార బీఆర్ ఎస్ పార్టీ తాయిలాలతో ఎన్నికలను అపహాస్యం చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు దుయ్యబడుతున్నారు. గతంలో పోలింగ్ కు ఒకటి, రెండు రోజుల ముందుగానే తాయిలాల పంపిణీ జరిగేదని, బరితెగించిన బీఆర్ ఎస్ ఇప్పటినుంచే ఓటర్లను తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు వ్యూహ రచన చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఓట్లను కొల్లగొట్టేందుకు తాయిలాలను ఎరగా చూపుతున్నారని మండిపడ్డారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాల్సిన అధికార పార్టీ నాయకులు వారే అడ్డదారులు తొక్కుతూ అధికారం కోసం వెంపర్లాడుతున్నారని ఆరోపిస్తున్నారు. బీఆర్ ఎస్ నేతల అధికార దాహంతో ఎన్నికలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రచారానికి తాయిలాలకు తెరలేపిన వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ప్రభుత్వ వైఫల్యంతోనే..

# నిరుద్యోగి ఆత్మహత్య

**హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ఒక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకుందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు. టీఎస్పీఎస్సీ తప్పుల మీద తప్పుల చేస్తున్నా అధికార పార్టీ వెనుకేసుకురావడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. శనివారం టిఎస్పీఎస్సీ నిర్లక్ష్యంపై అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడానికి వెళుతున్న నేతలను పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. దీంతో వినతి పత్రాన్ని గేటుకు పెట్టి నిరసన తెలిపారు. అనంతరం నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు, యువతకు ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. బోర్డు చైర్మన్ తో సహా టీఎస్పీఎస్సీ సభ్యులను తొలగించి సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా డీఎస్సీ పోస్టులను 13,500 (బ్యాక్ లాగ్ పోస్టులు కాకుండా అదనంగా )కు పెంచాలన్నారు. గ్రూప్ 1 రద్దుకు టీఎస్పీఎస్సీబాధ్యత వహించి పరీక్షలు రాసిన ఒక్కో అభ్యర్థికి రూ.3లక్షల పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యులు ఇనగాల వెంకట్రామిరెడ్డి, అఖిలపక్ష నాయకులు సీపీఐ వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి, టీడీపీ, బీఎస్ పీ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, నాయిని లక్ష్మా రెడ్డి, రహీమున్నిస్సా బేగం, సున్నా అప్పారావు, రాహుల్ రెడ్డి, పల్లకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.









# మొదలైన బతుకమ్మ సంబరాలు

**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ధర్మసాగర్ మండల పరిధిలో శనివారం బతుకమ్మ పండుగ సంబురాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలి పువ్వుల బతుకమ్మ పెద్దలు, పిల్లలు, ఇంటి ఆడపడుచులు భక్తి శ్రద్దలతో నిర్వహించుకున్నారు. గౌరమ్మను భక్తితో కొలిచారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు శివాలయంలో బతుకమ్మలతో ఆడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

## సీపీ అంబర్ కిషోర్ ఝాను కలిసిన కలెక్టర్



వరంగల్ వాయిస్, హనుమకొండ : వరంగల్ పోలీస్ కమిషనర్ గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అంబర్ కిషోర్ ఝాను శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నూతన సీపీకి కలెక్టర్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి సమన్వయంతో పనిచేయాలనీ అయన కలెక్టర్‌కు సూచించారు.

## ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ



వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని అక్షర కాన్సెప్ట్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తంగేడు, టేకు, గునుగు పువ్వులతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేకంగా అలంకరించారు. బతుకమ్మ పాటలు, కొలాటం ఆడుతూ డాన్స్ లు వేయడం ప్రత్యేక అక్షర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ షీనా మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతిలో లభించే పువ్వులకు పూజలు చేసే సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికే చెందుతుందని, ఇలా ప్రకృతిని ఆరాధించే పండుగల ప్రత్యేకతను, విశిష్టతను భవిష్యత్ తరాలకు అందించడం కోసమే విద్యాలయాల్లో వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బిజ్జు పీటర్, ఉపాధ్యాయులు కావ్య, సంధ్య, ఫబీన్, స్వరూప, సరిత, సుకన్య, సౌజన్య, బ్లేసి, సునీత, స్వరూప, సంపత్, మునేందర్, శివభార్గవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ సంగ్రామ్ సింగ్



వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ నేడు ఐడీఓసీలోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ కె.శశాంకను మర్యాద పూర్వకంగా కలిశారు.

## కనీస ఏర్పాట్లు కరువు



వరంగల్ వాయిస్, కాశిబుగ్గ : బతుకమ్మ ఆట స్థలాల్లో ఏర్పాట్లు శూన్యమని వరంగల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ ఆరోపించారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని అనేక డివిజన్లలో మహిళలు ఎంతో గొప్పగా జరుపుకునే బతుకమ్మ ఆట స్థలాల్లో కనీసంలైటింగ్ కూడా ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. దీంతో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులపై మహిళలు మండిపడుతున్నారు. సద్దుల బతుకమ్మను దృష్టిలో పెట్టుకుని నగరపాలక సంస్థ నుంచి ఆట స్థలాలకు ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలని

# ప్రవళికది ప్రభుత్వ హత్యనే

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేశ్ రెడ్డి



వరంగల్ వాయిస్, హనుమకొండ : నిన్న హైదరాబాద్, అశోక్ నగర్ లో ఆత్మహత్య చేసుకున్న దుగ్గొండి మండలం, బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన ప్రవళిక ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రం లో విద్యార్థి, నిరుద్యోగుల కొలువుల కోసం కొట్లాడుతూ ఉద్యమ కాలంలో సుమారు విలువైన 10ఏళ్ల కాలం ఉద్యమంలో పోయింది. తెలంగాణ వచ్చాక అయినా నిరుద్యోగుల కల సాకారం అవుతుందేమో అనుకుంటే కేసీఆర్ పాలనలో కన్నవారికి కడుపుకోత మిగిల్చి ఆత్మబలిదానాలు చెయ్యడమే శరణ్యం అవుతుంది. గడించిన పదేళ్ళలో కేసీఆర్ మాటలు నమ్మిన నిరుద్యోగ యువత తీవ్రంగా మోసపోయారని మండిపడ్డారు. గతంలో ఎందరో నిరుద్యోగులు కన్నవారి కలను నిజం చెయ్యలేక, ఉద్యోగాలు రాక, కోచింగ్ ల కోసం చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడ్డారని తెలిపారు. ఇదే ఉమ్మడి వరంగల్ కు చెందిన సునీల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు కూడా ఇదే ప్రాంతానికి చెందిన ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకనాడు ఉద్యమానికి ఊపిరూదిన ఈ నేల నుంచే తిరుగుబాటు బావుటా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ కోసం అమరులైన అమరవీరుల కలలు నెరవేరాలన్నా, నిరుద్యోగ అమరుల ఆత్మ శాంతించాలన్నా కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. మళ్లీ కేసీఆర్ కనుక సీఎం అయితే కోచింగ్ సెంటర్లు మార్చురీ గదుల్లా మారిపోతాయన్నారు. ఉద్యోగాల కోసం ఇన్నాళ్లు చదువుకున్న యువత దుబాయ్, మస్కట్ లో వలస కూలీలు అవ్వక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ మాత్రం వేమరపాటు ప్రదర్శించకుండా కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. ఈ నిరుద్యోగ ఉద్యమానికి, తిరుగుబాటుకు ఓరుగల్లే నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.

## నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం



వరంగల్ వాయిస్, పరకాల : సంగెం మండలం లోహిత మూల తండాకు చెందిన సుమన్ నాయక్ ఇటీవల ఆక్సిడెంట్ తో మృతిచెందగా అది తెలుసుకొని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.పెసరు విజయచందర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయంగా రూ. 5000 అందజేసి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం సంగెం మండలం షాపురం గ్రామానికి చెందిన కత్తి కొమరయ్య, అదే గ్రామానికి చెందిన కారింగుల ఉమా ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు కీసర వీరన్న, భూక్య వెంకన్న, మండల ఉపాధ్యక్షుడు భోగ కోటేశ్వర్, మండల కార్యదర్శి అచ్చ రాజు, అల్లం కుమారస్వామి, సట్ల వీరేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పోశాల కిషోర్, కూన కరుణాకర్, వేలూరు నరేందర్, రాజన్ కాగితాల సాయికుమార్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అరూరికే పాస్టర్స్ మద్దతు



వరంగల్ వాయిస్, వర్ధన్నపేట : బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కు నియోజకవర్గ పాస్టర్స్ తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అరూరి రమేష్ మూడోసారి లక్ష మెజారిటీతో విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్ర భాగాన నిలపడమే లక్ష్యంగా గత రెండు పర్యాయల నుంచి పని చేస్తున్నానని తెలిపారు. 2014, 2018 ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించిన వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. మరోసారి సేవ చేసేందుకు మీ ముందుకు వచ్చానని తమ ఇంటి బిడ్డగా నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ పాస్టర్స్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ నాయకుల ఆరోపణలు అవాస్తవం



వరంగల్ వాయిస్, దోర్నకల్ : అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. సీరోలు మండల ఉపాధ్యక్షుడు బుడిగ లక్ష్మీనారాయణ, సర్పంచ్ నాగాటి ఉపేంద్ర ఉప్పలయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుదుగుల వెంకన్న, ఉప సర్పంచ్ బానోతు బుజ్జి, జోగు సునీత ఉప్పలయ్య, గుగులోత్ సోమన్న, మేకల వీరన్న, మొండితోక స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ గా గెలిచిన నాటి నుంచి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా అనేక అవరోధాలను అధికార పార్టీ నాయకులు సృష్టిస్తున్నారన్నారు. ఇటీవలే గ్రామంలో జరిగిన నూతన రోడ్ల పనులపై తమకు గ్రామ నాయకులు ఎవరు వచ్చి కూడా తమకు వీడీసీ ఇవ్వాలని అడగలేదని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పాలకవర్గ సమావేశం ఏర్పాటుచేసి తీర్మానాలు చేస్తున్నప్పటికీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఏ నాయకులు తమ పాలకవర్గాన్ని సంప్రదించలేదని, ఎటువంటి దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు. అంతేకాకుండా గ్రామంలోని సర్పంచ్ కు కాకుండా కార్యదర్శిని వీడీసీ ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో తట్టుకోలేని ఆయన ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి గ్రామ ప్రజలకు తెలుసన్నారు. కాగా ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం వీడీసీ కావాలని కోరడంతో ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున నిబంధన మేరకు వీడీసీ ఇవ్వలేమని సర్పంచ్ తెలపడం జరిగిందన్నారు. కావాలని సర్పంచ్ పై తప్పుడు ఆరోపణలు చేసి బురదజల్లే ప్రయత్నాలు మానుకొని ఇప్పటికైనా గ్రామ అభివృద్ధికి కలిసి రావాలని సూచించారు.

# కన్నుల పండుగగా శ్రీ శారద హరిద్రా దర్శనం



వరంగల్ వాయిస్, వరంగల్ : జిల్లా కేంద్రంలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం కన్నుల పండుగగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు శ్రీ శారద అమ్మవారు విశేషా హరిద్రా దర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. ప్రధాన అర్చకులు సంగమేశ్వర జోషి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర శర్మ, రామకృష్ణ శర్మ, సోమశేఖర శర్మ, వివేక్ జోషి, విశాల్ జోషి, సాయి శర్మలు శ్రీ శారద అమ్మవారికి పంచసూక్తలతో సకల నదీ జలాలతో మహాభిషేకం చేశారు. అనంతరం భక్తులు సమర్పించిన పసుపుతో అమ్మవారిని హరిద్రా అలంకరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీ శృంగేరి శంకరమఠం ఆస్థాన పౌరాణికులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి మాట్లాడుతూ శ్రీ శారద అమ్మవారు జగత్తు (ప్రపంచం)ను ప్రసవించిన ఈరోజు విశేషమైనదని, అందుకే అమ్మవారు జగత్ ప్రసూతిక అలంకరణతో హరిద్ర దర్శనం ఇస్తారని చెప్పారు. హరిద్ర దర్శనంతో భక్తులకు సకల కష్టాలు బాధలు తొలగి లోక కళ్యాణము



జరుగుతుందన్నారు. వరంగల్ శంకరమఠం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యలు చెప్పారు. ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, సంరక్ష ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పోలా నటరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ శంకర సేవా సమితి సభ్యులు రామారావు, భాస్కర్, రవీందర్, దేవేందర్, రాజేంద్రప్రసాద్, మదన్మోహన్, రాజు, సంధ్యారాణి, పద్మ, రమాదేవి, కళ్యాణి లు అశేషంగా హాజరైన భక్తులకు సేవలందించారు. వరంగల్ హనుమకొండ, కాజీపేట తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

# వైభవంగా వేంకటేశ్వర స్వామి కళ్యాణం



వరంగల్ వాయిస్, చిల్పూరు : శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం శనివారం వేదమంత్రోచరణలతో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా అర్చకులు నిర్వహించారు. భక్తులు కళ్యాణాన్ని కన్నుల పండుగగా తిలకించారు. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారి కళ్యాణానంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి.లక్ష్మీ ప్రసన్న, అభివృద్ధి కమిటీ చైర్మన్ పొట్లపెల్లి శ్రీధర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు, ముఖ్య అర్చకులు బి.రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. స్టేషన్ ఘనపురానికి చెందిన కటికనేని ప్రవీణ్ తమ తల్లి కీర్తిశేషులు కటికనేని వైదేహి పేరు మీద ఈ రోజు అన్నదానం చేయడం జరిగింది.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు



వరంగల్ వాయిస్, తొర్రూరు : పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం కంటేయ్యపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుమారు 70 మంది కార్యకర్తలు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బూత్ లెవెల్ నుంచి పార్టీ ప్రతిష్ఠ కోసం కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రతి గడపకు చేరవేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడి లాగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, గ్రామ ఇంఛార్జి కొండెం ఉపేందర్ రెడ్డి, ఎడ్ల వెంకట్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు మొకటి వెంకన్న, వార్డు మెంబర్ ఉపేందర్, మందపురి శ్రీధర్, మందపురి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం హత్యనే ప్రవళికది

## బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కల్లూరి పవన్



వరంగల్ వాయిస్, హనుమకొండ : గ్రూప్ 2 పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న ప్రవళిక ఎలక్షన్ కోడ్ రావడం వలన పరీక్షలు రద్దు కావడంతో అత్యహత్య చేసుకొంది. ఆమె ఆత్మహత్య బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి పవన్ ఆరోపించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ రాకే ముందే గ్రూప్ -2నోటిఫికేషన్ ఇస్తే ఇలాంటి ఆత్మహత్యలు జరిగేవి కాదు కాదా అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అనేక మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోవడం జరుగుతుందని, టీస్పీఎస్సీ పూర్తిగా విఫలం చెందిందన్నారు. వెంటనే సీఎం ప్రవళిక కుటుంబానికి క్షమాపణ చెప్పాలని,కుటుంబానికి అండగా ఉండాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు ఈసారి ఓటు వేసే ముందు అలోచించి వేయాలని కోరారు.

# కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



వరంగల్ వాయిస్, కే యూ : గ్రూప్-1 పేపర్ లీకేజీ, రెండు సార్లు గ్రూప్-1 పేపర్ రద్దు కావడం, గ్రూప్-2 పేపర్ వాయిదా వేయడం వల్ల నిరాశకు లోనై ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని కేయూ జేఏసీ నాయకులు మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయాలని, రూ. కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయాలని వారి గ్రామంలో నిరసన తెలియచేస్తున్న కేయూ జేఏసీ, ఓయూ జేఏసీ నాయకులు తిరుపతి యాదవ్, గుగులోతు రాజు నాయక్, విజయ్ ఖన్నా, వెంకట్ రెడ్డి, బండి రాకేష్ లపై బీఆర్ ఎస్ గుండాలు, పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దాడి చేసిన బీఆర్ఎస్ గుండాల పై కేసులు పెట్టాలని, అదే విధంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగంటి నాగరాజు, సోల్తీ కిరణ్ గౌడ్, బీఎస్ ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, బీసీ విద్యార్థి సంఘం కేయూ అధ్యక్షుడు మధు గౌడ్, నాయకులు సాయిరాం, శ్రీకాంత్, వెంకటేష్, గణేష్, అనిల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత

## బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



వరంగల్ వాయిస్, వరంగల్ : రాష్ట్రంలో అసమర్థ, అవినీతికర పాలన వల్ల రోజురోజుకు నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ 2, డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ కు చెందిన ప్రవల్లిక హైదరాబాదులోని హాస్టల్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు . టీఎస్పీఎస్సీ నిర్వాకం వలన పరీక్షలు వాయిదా పడడం నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. తక్షణమే టీస్పీఎస్సీ రద్దు చేయాలన్నారు. నిరుద్యోగుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలు గానే భావించాలన్నారు. ప్రవల్లిక ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. అనేక పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి రావడానికి ప్రభుత్వ నేరపూరితమైన అవినీతికర విధానాలే కారణమన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఎట్టి పరిస్థితుల్లోనైనా ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఉద్యోగాల సాధనకు సంఘటితంగా పోరాడాలన్నారు. ప్రవల్లిక కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియో, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, మూడు ఎకరాల భూమితో పాటు అన్ని విధాల ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక



వరంగల్ వాయిస్, వరంగల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ క్రీడ పోటీలను సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేటలో ఆదివారం నుంచి జరగనున్నాయి. ఈ రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్న వరంగల్ ఫుట్ బాల్ బాలికల జట్టు క్రీడాకారులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ వరంగల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బరుపాటి గోపి రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ వరంగల్ ఫుట్ బాల్ బాలికల జట్టుకు క్రీడలకు సంబంధించిన పలు సూచనలతో పాటు క్రీడాస్ఫూర్తితో క్రీడలలో పాల్గొన్ని రాష్ట్ర స్థాయి వరంగల్ జిల్లా జట్టు విజయకేతనం ఎగురవేయాలని క్రీడాకారులకు తెలిపారు. జట్టులోని క్రీడాకారుల వివరాలు యన్. భువన, యన్.స్వాతి, జే.అను, జే.మయూరి, జి.ఐశ్వర్య, జే.మాధురి, జి.శరణ్య, జి.నిహారిక, బి.ఇందు, యస్.వైష్ణవి, యం.శ్రీజ, కే.మౌనిక, జి.వైష్ణవి, టీ.కృపా, పి.శ్రీజ, టీమ్ కోచ్ జి.ప్రేమ్ ప్రసాద్ రావు, టీమ్ మేనేజర్ గా జ్యోతి ఉన్నారు.

# ఎంపీని కలిసిన ఉర్సు దసరా ఉత్సవ కమిటీ



వరంగల్ వాయిస్, వరంగల్ : ఉర్సు కరీమాబాద్ దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం వరంగల్ పార్లమెంట్ సభ్యుడు పసునూరి దయాకర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు 22న సద్దుల బతుకమ్మ, 23న దసరా పండుగ, రావణ వధ, విజయదశమి, ఉత్సవాలు రంగలీలా మైదానంలో వైభవంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఎంపీ స్పందిస్తూ రంగలీలా మైదానంలో దేశంలోనే అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలు జరుగుతాయని, ఈ సారి మరింత వైభవంగా నిర్వహించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, కన్వీనర్ వాడాల నరేందర్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, సహాయ కోశాధికారి వెలిగే శివమూర్తి, ఉపాధ్యక్షుడు గోన్ రాగప్రసాద్, నాగపురి రంజిత్, పొగాకు సందీప్, దామెరకొండ వెంకటేశ్వర్లు, బూరి వాసు, అజయ్, బత్తిని అభివ్ గౌడ్, నాగేపురి అశోక్, పూదరి బొల్లం రొజు, కార్యదర్శులు నాగపురి మువేవ్, వరిగెత్తును, గట్టు గోవర్ధన్, నాగపురి సంతోష్, ఆర్గనైజర్లు సాగారు చిరంజీవి, నాగపురి కాళిదాసు, బిల్లు క్రాంతి, నాగ రాజు, పార్వతి కృష్ణం రాజు, బైరివంశ, మోజాం రాజశేఖర్ పాల్గొన్నాను.

## టీఎస్పీఎస్సీని రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** నిరుద్యోగ యువతీ ప్రవళికది ప్రభుత్వ హత్యనే అని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం సీవై ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ బాబు, ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర నాయకుడు గూగులోతు అరుణ్ లు స్థానిక పట్టణంలోని గాంధీ సెంటర్ లో నిరుద్యోగ యువతీ ప్రవళిక ఆత్మకు శాంతి చేకూర్చాలని , నిరుద్యోగ వ్యతిరేక ప్రభుత్వ విధానాలు నశించాలని గాంధీ సెంటర్ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగుల ఆత్మహత్యలకు కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరే కారణమని విమర్శించారు. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ప్రవళిక గ్రూప్-2, టీఆర్టి పరీక్షలు వాయిదా వేయడం వల్లే ఆందోళనకు గురై బలవన్మరణానికి పాల్పడిందన్నారు. ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, ఐదు కోట్ల నష్టపరిహారాన్ని వారి కుటుంబానికి ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి అర్హత కలిగిన వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైన టీఎస్పీఎస్సీ బోర్డును తక్షణమే రద్దుచేసి నూతన బోర్డును ఏర్పాటు చేయాలని, టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డిని తక్షణమే తొలగించాలని అతనిపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సీవైఎస్ఎస్ జిల్లా నాయకులు హరీష్, శివాజీ, నితిన్ ,ఉదయ్ ,కుమార్, రవి, సాయి, రాజేష్ పాల్గొన్నారు.

## గుడుంబా స్థానాలపై పోలీసుల దాడులు



**వరంగల్ వాయిస్, కాటారం :** సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాటారం పోలీసులు పంజా విసురుతున్నారు. ఇందులో భాగంగా గుడుంబా, బెల్ట్ షాపులపై ఉక్కు పాదం మోపుతున్నారు. కాటారం ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ప్రజలతో సభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు చేపట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తూ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. బెల్ట్ షాపులు నిర్వహించవద్దని, గుడుంబా తయారు, అమ్మకాలు చేపట్టవద్దని సూచిస్తున్నారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌తో పాటు గంగారాం తండాలో శనివారం గుడుంబా స్థావరాల పై దాడులు నిర్వహించి 18లీటర్ల గుడుంబా పట్టుకుని, 600 లీటర్ల బెల్లం వాష్, సంబంధిత వస్తువులను ధ్వంసం చేశారు. ప్రజలతో మమేకమై గుడుంబాకు సంబంధించి ప్రజలను హెచ్చరించి సజావుగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలకు సహకరించాలని సూచించారు.

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** పర్వతగిరిలోని ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసంలో దేవరుప్పుల మండలం బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు వంగ అర్జున్ ఆధ్వర్యంలో చిన్నమడూరు గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎర్రబెల్లి దయాకర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కొత్త, పాత తేడా లేకుండా ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేసి పార్టీ గెలుపునకు లక్ష్యంగా కృషి చేయాలని వారికి సూచించారు. పార్టీలో చేరిన వారు కంకటి శ్రీను, సమ్మిరాజు, సమ్మి చంద్రశేఖర్, రాజు, రమేష్, సురేష్, స్వామి, అంజన్ కుమార్, ఆంజనేయులు, దిలీప్, సాయి, మల్లేష్, ఉదయ్, హరీష్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మండల యూత్ అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## 16న కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



**వరంగల్ వాయిస్, కాటారం :** సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 16న కాటారం మండల కేంద్రమైన గారెపల్లి బీఎల్ఎం గార్డెన్ లో కాటారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంథని శాసనసభ్యుడు, ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిల్ల శ్రీధర్ బాబు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని కాంగ్రెస్, యూత్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ అనుబంధ సంఘాల నాయకులు, వార్డు మెంబర్ నుంచి మొదలుకొని వివిధ కమిటీల చైర్మన్లు సమావేశానికి సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఆడపడుచులకు ‘బతుకమ్మ’ శుభాకాంక్షలు

**ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కరీమాబాద్ లక్ష్మినగర్ లో మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై అడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో జరుపుకునే ఈ గొప్ప పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికి బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులు ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై విస్తృత ప్రచారం



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ ఇనగాల నివాసం వద్ద శనివారం పరకాల నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఐఎన్ టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారెంటీ పథకాలపై గ్రామ గ్రామాన ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని, గతంలో ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిందని, ఉచితంగా కరెంట్‌ను ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చామని, భూముల్లేని వారికి భూములిచ్చిన ఘనత కాంగ్రెదేనన్నారు. దళితబంధు, బీసీ, మైనార్టీ, గిరిజన బంధు వంటి పథకాలతో ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు కుట్రలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ప్రజల ఓట్లను రాబట్టేందుకు సాధ్యం కానీ హామీలిస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీని నమ్మె పరిస్థితుల్లో ప్రజలు లేరని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు నేరవేర్చగలిగే హామీలను ఇస్తుందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందన్నారు. ప్రతి కార్యకర్త,నాయకులు ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్యారెంటీ కార్డు ఇచ్చి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, వివిధ మండలాల, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు, వివిధ అనుబంధల సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతో కాంగ్రెస్ నేతలపై కేసులు



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** దేవరుప్పుల మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నందుకు నిరసనగా అఖిల పక్ష నాయకులు టీపీసీసీ నాయకుడు, డాక్టర్ లకావత్ లక్ష్మి నారాయణ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, బీఎస్పీ పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జి రాపాక శ్రీశైలం, దేవరుప్పుల మండలంలో ప్రధాన చౌరస్తా నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ కు పాదయాత్రగా వెళ్లి ఓయూ జెఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీపై పెట్టిన అక్రమ కేసుకు సంభందించిన వివరాలను దేవరుప్పుల మండల ఎస్సై శ్రావణ్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. అనతరం మీడియాతో మాట్లాడుతూ స్థానిక మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఓటమి భయంతో ఇతర పార్టీలో ప్రధాన పాత్ర నిర్వహించే ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యగా, వేధింపు చర్యలు, పార్టీ ఫిరాయింపు, మానుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఫోటో ఉన్న టిఫిన్ బాక్సులు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు పంచుతున్నారని, విషయం తెలిసి అందులో భాగంగానే అక్కడికి వెళ్లి ప్రజలకు నచ్చజెప్పే విధంగా పృథ్వీ రెడ్డి మాట్లాడినందుకు ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేసినందుకు అతనిపై అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. అమాయక గిరిజనుల ఓట్లు దండుకోవాలని చూస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గిరిజన మహిళలతో చిల్లర రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేశ్, మండల యూత్ అధ్యక్షుడు యాకస్వామి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా సజ్జన్, అఖిల పక్ష నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ తీర్థం పుచ్చుకున్న కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల:** రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో దేశ ప్రజల దృష్టి సీఎం కేసీఆర్ వైపు మళ్లిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని మన్ పహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ దావుల వెంకన్న, నాయకులు జోగు పరశురాములు, దొంతోజు పరిపూర్ణాచారి డి. యాదగిరి శనివారం బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు ఏల సుందర్ ఆధ్వర్యంలో తన స్వగృహంలో మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దేశ వ్యాప్తంగా కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పాలకుర్తిలో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తీగల దయాకర్ గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చింత రవి, సీనియర్ నాయకులు జోగు సోమనర్సయ్య, మన్ పహాడ్ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి జోగు వీరస్వామి, మండల యూత్ అధ్యక్షుడు బానోతు నవీన్ నాయక్, ప్రధాన కార్యదర్శి జోగు ఐలుమల్లు, దేవరుప్పుల మాజీ సర్పంచ్ చింత యాదగిరి, నాయకులు శీల తిరుమలేష్, ఉప్పుల పరశురాములు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చనిపోయిన దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవళిక మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆమె కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కాంగ్రెస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ నోటిఫికేషన్ రద్దు కారణంగా మనస్థాపానికి గురైన నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవళిక ఆత్మహత్యను ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అన్నారు. నోటిఫికేషన్ల రద్దు పేరుతో పేపర్ లీకేజీల పేరుతో నిరుద్యోగ యువకులను దారుణంగా మోసం చేస్తున్న ఈ అధికార పార్టీ బీఆర్ఎస్ పార్టీని తరిమికొట్టాలన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే యువకులందరికీ ఉద్యోగాలు వస్తాయని కొంతమంది విద్యార్థులు బలిదానాలు చేసుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ దొంగల ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకపోగా వారి ప్రాణాలు తీసుకునే స్థాయికి దిగజారిందన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ల పెల్లి నర్సయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మండల ఉపాధ్యక్షుడు నన్నెబొయిన రమేష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, సర్పంచ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేన రమేష్, మాజీ ఎంపీటీసీ బిల్లా ఇంద్రసేనా రెడ్డి, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు అమీరొద్దీన్, అక్కల్ చెడ గ్రామ సర్పంచ్ తూటి పావని రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, అక్కల్ చెడ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్, నాయకులు బొంత సారయ్య, బుడిగే శ్రీనివాస్, చేవ్వ వెంకన్న, బక్కన్న, జైపాల్ రెడ్డి, పుల్లా రెడ్డి, వార్డు సభ్యులు ఆకుల అశోక్, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు లక్క రాజు, బాలు నాయక్, కుండే రవి, లక్క విజేందర్, పడిదం రాకేష్, లావుడ్యా రాజు, నవీన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## బండా ప్రకాష్‌ను కలిసిన కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు ధూపం సంపత్ ఆధ్వర్యంలో తెలంగాణ శాసనమండలి ఉపసభాపతి బండ ప్రకాష్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కాశిబుగ్గ బతుకమ్మ దసరా ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండ ప్రకాష్ మాట్లాడుతూ బతుకమ్మ దసరా ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాటు చేసేందుకు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలోదసరా ఉత్సవ సమితి కన్వీనర్ భయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, దసరా పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి బాంబుల కుమార్, రాచర్ల శ్రీనివాస్, మార్త ఆంజనేయులు, గుత్తికొండ నవీన్, ఓం ప్రకాష్ కొలారియా, గోరంటల రాజు, సిద్దోజు శ్రీనివాస్, వేముల నాగరాజు, గణిపాక సుధాకర్, వలుపదాసు గోపి, సిలువేరు థామస్, ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు మైసమ్మ దేవీ నవరాత్రి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గలోని కొలువై ఉన్న శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు రేపటి నుంచి ఈనెల 2 వరకు ప్రతిరోజు ఒక్కొక్క అవతారంతో అమ్మవారిని అలంకరించడం జరుగుతుంది. ఇలా తొమ్మిది రోజులు నిష్ఠతో అమ్మవారిని కొలుస్తారు. దీనికి ప్రతి ఒక్క భక్తుడు వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ప్రధాన అర్చకులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిరోజు పాల్గొనే వారు ప్రధాన అర్చకులు వెల్దండి ఓంకార్, కుడికాల కోటేశ్వర్, మామిడాల సతీష్, కట్టర్ యుగేందర్, నల్ల సతీష్, కందగట్ల శ్రీనాథ్, నోముల రాజేశ్వర్, కూచన రవీందర్, గుండేటి రజిని కాంత్ అయ్యగారు, బిట్ల వెంకటరత్నం, వెల్దండ దామోదర్ పిల్లల వెంకన్న, నలివెల అజయ్ కుమార్, రామ భాస్కర్ తదితులు పాల్గొన్నారు.

## ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** బతుకమ్మ పర్వదిన వేడుకలు మండలంలో శనివారం ఘనంగా మొదలయ్యాయి. తొమ్మిది రోజులపాటు కొనసాగే వేడుకల్లో భాగంగా తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు చేపట్టారు. యువతులు, మహిళలు, చిన్నారులు అనే తేడా లేకుండా వారంతా తీరక్కొ పూవ్వులతో తెచ్చిన బతుకమ్మతో సాయంత్రం పూట ఎంతో సంబరంగా బయలు దేరారు. గ్రామ సమీపంలోని దేవాలయాల వద్ద, బొడ్రాయిల వద్ద బతుకమ్మను ఆటపాటలతో అలరించారు. ఇందుకోసం ఆయా గ్రామ పంచాయతీలు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ ఆత్మ గౌరవాన్ని చూపే పూల వేడుక బతుకమ్మ పండుగ శనివారం ప్రారంభమైంది. ఈ బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా మహిళలు జరుపుకుంటారు. శనివారం మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ తంగేడు, గునుగు, గుమ్మడి పూలతో బతుకమ్మను పేర్చి, బతుకమ్మతో సాయంత్రం వేళ గ్రామ సమీపంలోని ఆలయాల వద్ద చేరుకొని బతుకమ్మలంతా ఒకచోటకు చేర్చి ఉయ్యాల పాటలు, ఆటలతో ఆడి అందర్నీ అలరించారు. ఆయా ఆలయాల వద్ద గ్రామపంచాయతీ విద్యుత్తు లైట్లు అమర్చి సౌకర్యాలు కల్పించారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని సర్పంచ్ మోత్కూరి రవీంద్ర చారి అన్నారు. గ్రామంలో శనివారం ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మను వారి ఇంటిలో నుంచి తీరొక్క పువ్వులచే తయారు చేసుకొని ఊరు బయట వెంపలి చెట్టు ప్రతిష్టించి చుట్టూ బతకమ్మలను పూజా కార్యక్రమాలు నిర్వహించి తదనంతరం బతుకమ్మ పాటలకు నృత్య ప్రదర్శనలు చేయడం కోలాటాలు ఆడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాధవి రమేష్, వార్డు మెంబర్లు, మహిళలు పాల్గొన్నారు.

## సీపీ కిషోర్ ఝూను కలిసిన సీఐలు





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతన వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ ను మఆత్మకూర్ సీఐ రవి రాజ్, పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్ ర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## కలెక్టర్, జడ్జిలను కలిసిన ఎస్పీ కిరణ్ ఖారే





**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కిరణ్ ఖారే శనివారం కలెక్టర్ భవేష్ మిశ్రాను, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబుని మర్యాదపూర్వకంగా కలుసుకుకొని పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం వారు పలు అంశాలపై చర్చించారు.

## ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



**వరంగల్ వాయిస్, కాటారం:** హైదరాబాద్‌లోని అశోక్ నగర్ బృందావన్ హాస్టల్ లో నిరుద్యోగ విద్యార్థినీ ప్రవలిక మృతి చాలా బాధాకరమని ప్రజా సంఘాల నాయకుడు పీక కిరణ్ అన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ బోర్డు వైఫల్యం వల్ల, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో విద్యార్థి, నిరుద్యోగల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రవళిక ది ఆత్మహత్య కాదు ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే నని పీక కిరణ్ ధ్వజమెత్తారు. ప్రభుత్వం ప్రవళిక కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తన కుటుంబానికి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, తక్షణమే పరీక్షల తేదీలను ప్రకటించాలని, లక్షలాది మంది నిరుద్యోగల జీవితాలను నాశనం చేస్తున్న టీఎస్పీఎస్సీ బోర్డు చైర్మన్ తో సహా సభ్యులను తొలగించి, కమిషన్ చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం కొత్త సభ్యులను నియమించాలని సూచించారు.

## పల్లె పల్లెకు బీజేపీ.. ఇంటింటికి హుస్సేన్ నాయక్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పల్లె పల్లెకు బీజేపీ.. ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర శనివారం మమబూబాబాద్ అనంతారం గ్రామంలో నిర్వహించారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు తానే స్వయంగా నిర్మించి ఇస్తామని, అమాయక ప్రజలను నిమ్మించి కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. దళిత బంధు, గిరిజన బంధు పేరిట అయా వర్గాల ప్రజలను ఓటు బ్యాంక్ గా కేసీఆర్ వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలందరూ కేసీఆర్ అవినీతి, అక్రమాలను ఎప్పటికప్పుడు చూస్తున్నారని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేస్తా అని మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో రైతులు బొందపెట్టడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోటి, జాటోతు సంతోష్, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచందర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ సిద్ధార్థ రెడ్డి, పల్లె సందీప్, వెన్నేమల్ల సందీప్, సురేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పని చేస్తేనే సంతృప్తి

తాజాగా జరిగిన ఓ పుస్కకావిష్కరణలో మెగాస్టార్ చిరంజీవి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాల కోసం కష్టపడి పని చేస్తేనే సంతృప్తిగా ఉంటుందని అన్నారు. ఏ రంగంలోనైనా కష్టపడి పనిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన హీరోయిజం, ఎలివేషన గురించి చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. “ఒక్కోసారి నాకు అనిపిస్తూ ఉంటుంది. ఇంత సాధించినా ఇంకా ఇంత కష్టపడటం అవసరమా? ఇంకా ఎన్ని రోజులు ఇలా కష్టపడి డ్యాన్స్‌లు ఫైట్‌లు చేయాలని అనుకుంటూ ఉంటాను. నడుచుకుంటూ వెళ్లి, రీరికార్డింగ్‌తో హీరోయిజాన్ని లేపే రోజులివి. హాయిగా సెట్‌కు వెళ్లి మేకప్ వేసుకుని, నటించి.. వాళ్లు ఇచ్చిన డబ్బులు జేబులో పెట్టుకుని వచ్చేస్త బాగుంటుంది. కానీ, అలాంటి పరిస్థితి మనది కాదు. అయితే దీనిని కొందరు పాజిటివ్‌గా తీసుకుంటే మరికొందరు నెగటివ్ వేలో తీసుకున్నారు. రీరికార్డింగ్‌తో హీరోయిజం ఎలివేట్ అవుతుందా? దాంతోనే సినిమాలు ఆడుతున్నాయా? అని కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం చిరంజీవి చేతిలో రెండు చిత్రాలున్నాయి. ‘బింబిసార’ ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో మెగా157 చేస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి





## బ్లాక్ డ్రెస్‌లో అదరగొడుతుంది

యంగ్ హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.సీరియల్ నటిగా కెరీర్ ను ప్రారంభించిన పాయల్ రాజ్ పుత్ పంజాబీ, హిందీ చిత్రాలతో నటిగా మారింది.ఆ తర్వాత నేరుగా టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి అదరగొట్టింది.పాయల్ ‘ఆర్స్ ఎక్స్ 100’సినిమా తో తెలుగు ఇండస్ట్రీ కి పరిచయం అయింది. ఆ సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మొదటి చిత్రంతోనే పాయల్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తన బోల్డ్ పెర్ఫామెన్స్తో మతులు పోగొట్టింది. అప్పట్లో ఈ భామ అందాల ఆరబోత టాలీవుడ్ లో సెన్సేషన్ గా మారింది.. ఆ తరువాత ఇక్కడ ఆమె . ‘సీత’, ‘ఆర్డీఎక్స్ లవ్’, ‘వెంకీ మామా’, ‘డిస్కో రాజా’, ‘అనగనగ ఓ అతిథి’, ‘తీస్ మార్ ఖాన్’, ‘జిన్నా’ వంటి సినిమాల్లో మెరిసింది. అయితే కొన్నాళ్లుగా ఈ ముద్దుగుమ్మ సినీ కెరీర్ అంతా సాఫీగా సాగడం లేదు.తమిళంలోకీ ఎంట్రీ ఇచ్చినా కూడా అక్కడా సరైన సినిమా పడలేదు. నటించిన చిత్రాలూ ఆశించిన విజయాలను ఇవ్వలేదు..దీంతో మరోసారి తన మొదటి సినిమా ‘ఆర్ ఎక్స్100’ డైరెక్టర్ అజయ్ భూపతితో చేతులు కలిపింది.వీరిద్దరి కాంబోలో ప్రస్తుతం ‘మంగళవారం’ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రం లో పాయల్ లుక్ ఎంతగానో ఆకట్టుకోబోతోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, సాంగ్స్ సినిమాపై ఆసక్తిని పెంచేశాయి. ఈ క్రమంలో ప్రమోషన్స్ ను కూడా ఎంతో ఆసక్తికరంగా నిర్వహిస్తున్నారు.పాయల్ ఈ సినిమాపైనే ప్రస్తుతం భారీగా ఆశలు పెట్టుకుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.ఈ క్రమంలోనే పాయల్ కూడా తన అభిమానులను మరింతగా ఆకట్టుకునేందుకు నెట్టింట తెగ సందడి చేస్తోంది. అదిరిపోయే అవుట్ ఫిట్లలో ఫొటోషూట్లు చేస్తూ ఎంతగానో ఆకట్టుకుంటోంది.తాజాగా ఈ ముద్దుగుమ్మ బ్లాక్ అవుట్ ఫిట్ లో దర్శనమిచ్చింది. హాట్ థైస్ అందాలతో మతులు పోగొట్టింది. లేక్ వ్యూ పాయింట్ వద్ద కిర్రాక్ ఫోజులిస్తూ కుర్ర గుండెల్ని దోచుకుంది. గ్లామర్ మెరుపులతోనూ మైమరిపించింది. ఈ భామ అదిరిపోయే స్టిల్స్ కు ఫ్యాన్స్ తో పాటు నెటిజన్లు ఎంతగానో ఫిదా అవుతున్నారు.



## విరూపాక్ష తరహాలోనే

కిక్, రేస్ గుర్రం లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలు తీసిన సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన లేటెస్ట్ మూవీ ఏజెంట్. ఈ మూవీపై చాలా అంచనాలు పెట్టుకున్నాడు టాలీవుడ్ హీరో అఖిల్. స్పై యాక్షన్ థ్రిల్లర్ గా వచ్చిన ఈ సినిమా కోసం సిక్స్ ప్యాక్ చేసి సరికొత్తగా ట్రాన్స్ ఫార్మ్ అయ్యారు. తన కెరీర్ కి ఏజెంట్ ఒక మంచి బ్రేక్ ఇస్తుందని భావించారు. అయితే సినిమా ఫలితం నిరాశపరిచింది. ఈ సినిమా తర్వాత అఖిల్ నుంచి కొత్త సినిమా ప్రకటన ఇంకా రాలేదు. అయితే ఈ గ్యాప్‌లో ఓ రెండు కథలని లైన్ పెట్టారు అఖిల్. ఇందులో విరూపాక్ష ఫేం కార్తిక్ దండు దర్శకత్వంలో ఓ సినిమా వుంటుంది. విరూపాక్ష తరహాలోనే మిస్టీరియస్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉండబోతుంది. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయి. దాదాపు ఈ కాంబినేషన్ కుదిరినట్లే. బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. త్వరలోనే దీనికిపై అధికారిక ప్రకటన రానుంది.

## అడల్ట్ సినిమాలే చేస్తా

ఏక్త కపూర్ ప్రత్యేకించి పరిచయం అవసరం లేదు. బాలీవుడ్ నిర్మాతల్లో బోల్డ్ బ్యూటీ అనొచ్చు. ఏక్తాకపూర్ మాటలు ఎంత ఘాటుగా ఉంటాయో.. ఆమె తీసే సినిమాలు, డిజిటల్ కంటెంట్ కూడా అంతే హాట్‌గా ఉంటాయి. వివాదాలు, విమర్శలు ఆమె కొత్తకాదు. ఆమె మరోసారి విమర్శల పాలైంది. ఆమె నిర్మించిన చిత్రం ‘థ్యాంక్యూ ఫర్ కమింగ్’. భూమి ఫడ్నేకర్, షెహనాజ్‌గిల్ కీలక పాత్రధారులుగా నటించిన ఈ చిత్రానికి కరణ్ బూలానీ దర్శకుడు. ఏక్తాకపూర్, రియా కపూర్, అనిల్ కపూర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 6న విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఏక్తాకపూర్ ట్విట్టర్ వేదికగా సెక్షన్ నిర్వహించారు. ఇందులో నెటిజన్లు ఆమెపై విమర్శల వర్షం కురిపించారు. ‘నీ వల్ల ఎంతోమంది యువత చెడిపోతున్నారు. మంచి సినిమాలు చేయడం నేర్చుకో” అని పలువురు నెట్టింట కామెంట్ చేశారు. విమర్శలను ఇంచు కూడా లెక్క చేయని ఆమె తనదైన శైలిలో ఘాటుగా సమాధానం ఇచ్చింది. అనంతరం మరో నెటిజన్.. ‘దయచేసి మీరు అడల్ట్ సినిమాలు చేయడం మానండి’ అని కోరగా, దీనిపై ఆమె వ్యంగ్యంగా కామెంట్ చేశారు. ‘నో. నేనొక అడల్ట్. బోల్డ్ పర్సనని. కాబట్టి అడల్ట్ సినిమాలే చేస్తా’ అని కౌంటర్ ఇచ్చారు.



## కనీస ఏర్పాట్లు చేయని బల్దియా

### దుమ్మెత్తి పోస్తున్న మహిళలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర పండుగ బతుకమ్మ. ఈ పండుగకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేవడానికి బతుకమ్మే కారణం. ఇలాంటి బతుకమ్మ పండుగను పాలకులు నిర్లక్ష్యం చేస్తూ తెలంగాణ మహిళలను కించపరుస్తున్నారు. కనీస ఏర్పాట్లు కూడా చేయని బల్దియా అధికారులు, పాలకవర్గంపై మహిళా లోకం దుమ్మెత్తి పోస్తున్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే బతుకమ్మ పండుగపై పాలకులకు ఎందుకు నిర్లక్ష్యం అంటూ నిలదీస్తున్నారు. పాలకు నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ వీది దీపాల వెలుగుల్లోనే బతుకమ్మను ఆడుకున్నారు. నగర పరిధిలోని ఏ ఒక్క ప్రాంతంలో కూడా బల్దియా అధికారులు కనీస ఏర్పాట్లు చేయలేదంటూ మండిపడుతున్నారు. బల్దియా పాలకులకు రోజులు దగ్గరపడ్డాయంటూ శాపనార్థాలు పెట్టారు.



## వీధి దీపాలకిందే.. బతుకమ్మ



## ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**వరంగల్ వాయిస్, కల్చరల్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహానగరం శాఖ ఆధ్వర్యంలో నయీమ్ నగర్ గీతాంజలి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొని బతుకమ్మ ఆడుతూ సంబరాలు విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ మహానగర్ నగరకార్యదర్శి ఆరేపల్లి సుజిత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. అలాగే సాంస్కృతి సంప్రదాయాలు కాపాడుకునే విధంగా విద్యార్థులందరూ అవగాహన కల్పించాలని అలాగే ప్రతి ఒక్కరు కూడా పాటించి ఆచరణలో ఉంచాలని తెలియ జేశారు. విద్యార్థులందరికీ బతుకమ్మ పండుగ, దసరా శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ్ విభాగ్ గర్ల్స్ ఇంచార్జ్ బిందు, జోనల్ ఇన్చార్జ్ మనోజ్, కీర్తి రాహిత్య, అప్ప, రాకేష్, హరిచరణ్, భరత్, రాజ్ కుమార్, రేవంత్ సతీష్, తిరుపతి, అంజన్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ఘనంగా బతుకమ్మ పండుగ

**వరంగల్ వాయిస్, కల్చరల్ :** బతుకమ్మ పండుగను శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. భాద్రపద అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ పండుగను తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా జరుపుకుంటారు. తంగేడు పూలు, గునుగు పూలు, సీతజడ పూలతో పాటు పలు రకాల పూలతో బతుకమ్మను తయారు చేసి సాయంత్రం సమీపంలోని దేవాలయాలు, ఆట స్థలాలకు చేరుకొని పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ మహిళలు ఆనందంగా గడిపారు. నగరంలోని 40వ డివిజన్ బొడ్రాయి ఆంజనేయ స్వామి దేవాలయంలో బతుకమ్మ ఆడి, పాడారు. అదే విధంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 32 వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి ఎంగిలిపూల బతుకమ్మ పండగ సందర్భంగా స్థానిక మహిళలతో కలిసి నివాసంలో బతుకమ్మను పేర్చడం జరిగింది. అదేవిధంగా డివిజన్ మహిళలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తో పాటు స్థానిక మహిళలు కృష్ణవేణి, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ చౌరస్తా కాంగ్రెస్ భవన్ వెనుక వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి ఇంటి ముందర బతుకమ్మ ఆడి సందడి చేశారు.





## అమ్మవారి హరిద్రా దర్శనం

**వరంగల్ వాయిస్, కల్చరల్ :** నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవస్థానంలో ఆదివారం నుంచి అత్యంత భక్తి ప్రవత్తులతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా శనివారం అంకురార్పణ జరిగింది. ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన తర్వాత అమ్మవారు హరిద్రా క్రమంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సమర్పించిన 40 కిలోల స్వచ్ఛమైన హరిద్రా చూర్ణంతో అమ్మవారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం వరకు పసుపు వర్ణంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు ఎలాంతి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

### అమ్మవారిని దర్శించుకున్న సీపీ..



వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝా శనివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.శేషభారతి పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు. పూజ అనంతరం అమ్మవారి సన్నిధిలోనే సీపీకి శేషవస్త్రములను అందించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను చెందిన బుక్ లెట్ తోపాటు ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట డీసీపీ మురళీధర్ తదితరులు వున్నారు.

## ప్రవళికది ప్రభుత్వ హత్యే

### సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీఎస్పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ లు ఇవ్వడం, కోర్టులో కేసులు వేయించడం, పరీక్షలు వాయిదా వేయడం ఆనవాయితీగా మారిందని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు ఆరోపించారు. ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అన్నారు. ప్రవళిక అంతిమ సంస్కారాలకు హాజరైన విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు, బీఆర్ ఎస్ గుండాల దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం అకస్మాత్తుగా గ్రూప్ 2 వాయిదా వేయడంతో హైదరాబాదులో కోచింగ్ తీసుకుంటున్న ప్రవళిక మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నదని వెల్లడించారు. దుగ్గొండి మండలం బికాజ్ పల్లిలో ప్రవళిక అంత్యక్రియల ఊరేగింపు సమయంలో ఉస్మానియ, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహిస్తుండగా మూకుమ్మడిగా అటు పోలీసులు, ఇటు బీఆర్ ఎస్ గుండాలు దాడి చేసి తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న దమనకాండకు నిదర్శనమన్నారు. లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును పట్టిపాలు చేసి ప్రశ్నించిన వారిని చిత్ర హింసలకు గురిచేయడం కేసీఆర్ ప్రభుత్వం రాక్షస నీతికి పరాకాష్ట అన్నారు. అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బికాజ్ పల్లిలో జరిగిన దాడిని ప్రజలు ప్రజాస్వామిక వాదుల ఖండించాలని ఆయన కోరారు.

## యువతను గుండెల్లో పెట్టుకుంటా..

### తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన యువత గురువారం రాత్రి బీఆర్ ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువతను నా గుండెల్లో పెట్టుకొని చూసుకునే బాధ్యత నాది అంతూ ప్రకటించారు. మీ కష్టాల్లో అన్నగా మీకు తోడుగా ఉంటానంటూ హామీ ఇచ్చారు. నగరంలోని సాయి కన్వెన్షన్ హల్ లో శాసనమండలి వైస్ చైర్మన్, వరంగల్ తూర్పు ఎన్నికల ఇంచార్జి బండా ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com